ప్రజాశక్తి

సోమవారం 22 ఏప్రిల్ 2024 పేజీలు 8

విజయనగరం

పార్వతీపురం మన్యం

సమస్యలపై ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం శ్రేణులు (ఫైల్)

గిరిజనుల పాలిట వెలుగు రేఖ సిపిఎం

సమాజంలో అత్యంత వెనుబడిన వారెవరంటే టక్కున గుర్తుకు వచ్చేది ఆదివాసీ గిరిజనులే. పూర్వం గిరిజనుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ఆ పార్టీ గడిచిన మూడు దశాబ్ధాలుగా ఆ ప్రాంత అభివృద్ధి, సమస్యల కోసం నిరంతర పోరాటం చేస్తోంది. భూమి పంపిణీ చేయాలని, గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, విధ్వంశకర చర్యలు ఆపాలని, అభివృద్ధి పేరిట ఖనిజ సంపద దోపిడీని నివారించాలని, గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని, విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపర్చాలని, రహదారులు, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పించాలని, ప్రాజెక్టుల పేరిట నష్టపోయిన గిరిజనులు, గిరిజనేతరులకు మెరుగైన నష్టపరిహారం చెల్లించాలని ఇలా ఒకటేమిటి? సిపిఎం గిరిజనుల పాలిట వెలుగు రేఖలా పనిచేస్తోంది. ఈ క్రమంలో ఎన్నో సమస్యలు పరిష్కారమయ్యాయి. పాలకుల నిర్లక్ష్యంతో మరిన్ని సమస్యలు దీర్ఘకాలంగా కొనసాగుతున్నాయి.

2005లో జరిగిన తోటపల్లి పోరాటం సందర్భంగా నిర్వాసితులపై లాఠీఛార్జీ చేస్తున్న పోలీసులు

- ఎన్నో సమస్యలు పరిష్కారం
- మరిన్ని పోరాటాలకు సన్నద్ధం
- ఎన్నికల వేళ కమ్యూనిస్టులను గుర్తుచేసుకుంటున్న జనం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పార్వతీపురం గిరిజన ప్రాంతంలో 1960లోనే కమ్యూనిస్టు పార్టీకి బీజాలు పడ్డాయి. 1970లో కొన్ని కారణాలవల్ల సిపిఎం ఇబ్బందులు ఎదుర్కొన్నా 1980నాటికి పడిలేచిన కెరటంలా పార్టీ పునర్జీవం పోసుకుంది. దీంతో, గిరిజన ప్రాంతంలో ఉద్యమాలు క్రమంగా ఉపందుకున్నాయి. ఈ క్రమంలోనే 2004 ఎన్నికల్లో నాగూరు కేంద్రంగా ఉండే నేటి కురుపాం నియోజకవర్గం ప్రజానీకం సిపిఎం పార్టీకి పట్టం కట్టి ఎమ్మెల్యే స్థానాన్ని కల్పించారు. ఆ సందర్భంగా అసెంబ్లీలో పట్టుబట్టి పోరాడిందే నేడు అసంపూర్తిగా వున్న పూర్ణపాడు - లాబేసు వంతెన. అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం దీన్ని మంజూరు చేసింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టిడిపి, వైసిపిలకు చిత్తశుద్ధి లేకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో, నేటికీ విద్య, వైద్యం, నిత్యవసర సరుకుల కోసం నాగావళి నదిపై ప్రమాదపుటంచున్న పడవ ప్రయాణం చేయాల్సిన దుస్థితి దాపురిస్తోంది. సాగు భూములపై గిరిజనులకు హక్కు కల్పించాలన్న దేశవ్యాప్త డిమాండ్‌ను సిపిఎం పార్వతీపురం మన్యం నుంచే ప్రారంభించింది. ఈ క్రమంలో ఏర్పడిందే 2005 అటవీహక్కు చట్టం. 2004 కమ్యూనిస్టుల మద్ధతుతో ఏర్పడిన యుపిఎ-1 ఈ చట్టాన్ని రూపొందించి, దాని ప్రకారం గరిష్టంగా 10ఎకరాల భూములకు సాగుపట్టాలిచ్చేందుకు ముందుకు వచ్చింది. ఈ క్రమంలో మన్యం జిల్లాలో వేలాది ఎకరాల పోడు భూములకు ప్రభుత్వం ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చింది. ఆ తరువాత వచ్చిన టిడిపి, వైసిపిలకు చిత్తశుద్ధి కొరవడడంతో ఇంకా వేలాది గిరిజన కుటుంబాలు సాగు పట్టాలకు నోచుకోలేదు. ఏజెన్సీకి ఆనుకుని అత్యధిక గిరిజనులు నివాసం ఉంటున్న గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని దశాబ్దాలు తరబడి పోడుతోంది.

2005 ఏప్రిల్‌లో సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన తోటపల్లి నిర్వాసితుల పోరాటం దేశానికే ఆదర్శంగా నిలిచింది. అప్పటి ప్రభుత్వం 5ముంపు గ్రామాలుగా ప్రకటిస్తే సిపిఎం చేసిన సుదీర్ఘపోరాటంతో 24గ్రామాలకు ముంపు సమస్య ఉన్నటుగా గుర్తించడంతోపాటు మెరుగైన నష్టపరిహారం చెల్లించారు. ప్రస్తుతం అనేక ప్రాజెక్టుల నిర్వాసిత గ్రామాల్లో 18ఏళ్ల నిండినవారందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందు తుందంటే నాడు సిపిఎం ఆధ్వర్యాన తోటపల్లిలో చేపట్టిన ఉద్యమమే కారణం. జలాశయానికి వందమీటర్ల దూరంలోవున్న గ్రామాలను ముంపు ప్రాంతంగా గుర్తించే జీవో కూడా అప్పుడే రూపకల్పన (మిగతా..3లో)

నేడు చంద్రబాబు రాక

- మూడు రోజులపాటు జిల్లాలో విస్తృత ప్రచారం
- 24న ఒకే వేదికపై బాబు,పవన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మూడు రోజులు పాటు జిల్లాలో పర్యటించను న్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సాయంత్రం శృంగవరపుకోటలో రోడ్డుషో నిర్వహిస్తారు. శ్రీశైలం నుంచి నేరుగా సాయంత్రం 6గంలటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఎస్.కోట చేరుకుంటారు. రోడ్డు షో అనంతరం రాత్రి అక్కడే బస చేస్తారు. 23న ఉదయం 11గంలటలకు గజపతినగరం నియోజకవర్గం బొండపల్లిలో మహిళా ప్రజాగళం సభలో పాల్గొంటారు. ఇందుకు సంబంధించి జాతీయరహదారి పక్కన మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐ ప్రభాకర్, ఎస్ఐలు లక్ష్మణరావు, మహేష్ పరిశీలించారు. చంద్రబాబు ఆరోజు రాత్రికి అక్కడే బస చేస్తారు. 24న మధ్యాహ్నం 3గంటలకు నెల్లిమర్ల నియోజకవర్గం రామతీర్థంలోను, అదే రోజు సాయంత్రం విజయనగరంలో జరిగే సభలో చంద్రబాబుతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ పాల్గొంటారు.

అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రిసెప్షన్ సెంటర్ల వద్ద
పక్కా ఏర్పాట్లు

- నాణ్యమైన భోజనాన్ని అందజేయాలి : కలెక్టర్ నాగలక్ష్మి
- లెండి, జెఎన్‌టియు కళాశాలల పరిశీలన

ప్రజాశక్తి-డెంకాడ, విజయనగరం కోట

రిసెప్షన్ సెంటర్లవద్ద అన్ని వసతులను కల్పిస్తూ, పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఆదివారం జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయం, డెంకాడ మండలంలోని లెండి ఇంజనీరింగ్ కళాశాలలను సందర్శించారు. వాహనాల పార్కింగ్ కోసం పరిసర ప్రాంతాలను సైతం పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగురూములు, బారికేడింగ్, పార్కింగ్, భోజన ఏర్పాట్లపై (మిగతా..3లో)

భోగాపురం ఎయిర్‌పోర్టుకు
రూ.70 కోట్లతో నీటి సరఫరా

- రోజుకు 5 మిలియన్ లీటర్లు అవసరం
- మొదట విడతలో చంపావతి నది నుంచి రూ.28 కోట్లతో పనులు
- రెండో విడతలో తారకరామ తీర్థసాగర్ నుంచి..
- ఆగస్టులో పనులు పూర్తి చేయాలని నిర్ణయం

చంపావతి నదిలో జరుగుతున్న బోరుబావుల నిర్మాణం

భోగాపురం అంతార్జాతీయ విమానాశ్రయానికి నీటి సరఫరా పనులు ప్రారంభమయ్యాయి. ఈ విమానాశ్రయానికి ఒకరోజుకు 5 మిలియన్ (50లక్షలు) లీటర్లు అవసరమని గుర్తించారు. అందుకు 70 కోట్ల రూపాయలతో రెండు విడతల్లో పనులు జరగనున్నాయి. మొదటి విడత కింద రూ. 28 కోట్లతో 1.7మిలియన్ లీటర్లు నీటిని మాల నందిగాం గ్రామం వద్దనున్న చంపావతి నుంచి సరఫరా చేసేందుకు పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. ఆగస్టులో ఈ పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రెండోవిడతలో రూ.42కోట్లతో తారకరామ తీర్థసాగర్ నుంచి మరో పైపులైను వేసి తాగునీరు సరఫరా చేయనున్నారు.

ప్రజాశక్తి- భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనులు 2025 డిసెంబరు నెలాఖరుకు పూర్తయ్యేలా జిఎంఆర్ సంస్థ ఎల్అండ్‌టి సంస్థకు పనులు అప్పగించింది. అందుకు అవసరమైన తాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది. అందుకు అధికారులు తాగునీటిని నందిగాం పంచాయతీ మాల నందిగాం సమీపంలోని చంపావతి నదిలో బావులు నిర్మించి అక్కడ నుంచి సరఫరా చేయాలని నిర్ణయించారు. ఇందులో ఒక బావిలో నీటిని నిల్వ చేసి మరో బావి నుంచి నీటిని పంపింగ్ చేయనున్నారు. పైపులైనుకు సంబంధించి మాల నందిగాం, నందిగాం, ఉప్పుగెడ్డ, రామచంద్రపేట, మిరాకిల్ కళాశాల, బమ్మిడిపేట నుంచి చేపలకంచేరు వెళ్లే రహదారి మీదుగా గూడెపువలస మూడు గుళ్ల వద్ద విమానాశ్రాయానికి అనుసంధానం చేయనున్నారు.

అక్కడ నుంచి విమానాశ్రయం లోపలకు మరో 2కిలోమీటర్లు సరఫరా పాయింటుకు పైపులైను వేయనున్నారు. ఇలా మొత్తం (మిగతా..3లో)

జోరుగా సిపిఎం ఎన్నికల ప్రచారం

- పూర్ణపాడు- లాబేసు వంతెన పూర్తి చేయకపోవడం సిగ్గుచేటు
- సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ

ప్రజాశక్తి - కొమరాడ

కురుపాం నియోజవర్గంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తి చేయకపోవడం సిగ్గుచేటని కురుపాం నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి మండంగి రమణ అన్నారు. మండలంలోని నాగావళి ఆవతల ఉన్న తొమ్మిది పంచాయతీలు కొట్టు, గుణదతీలేసు, కెమిశీల, తొడుము, పాలెం పంచాయితీల్లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మిస్తున్న ప్రదేశాన్ని సిపిఎం నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రమణ, నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట కేవలం ఓట్లు కోసమే పూర్ణపాడు- లాబేసు వంతెనను పేరును ఉపయోగించుకుంటున్నారు తప్ప వంతెన నిర్మాణం మాత్రం జరగడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రతి రోజూ అభివృద్ధి అంటున్నారని, ఈ వంతెన పెండింగ్ పనులు పూర్తిచేస్తే అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. 14ఏళ్లయినా గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు ఈ వంతెన పెండింగ్ పనులు పూర్తి చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ వంతెన విషయంలో ఇప్పటికే పలుమార్లు అనేక పోరాటాలు సిపిఎం ఆధ్వర్యంలో జరుపుతున్నామని, అనేక కేసులు కూడా నమోదయ్యాయన్నారు. ఈ వంతెన పెండింగ్ పనులు కేవలం పోరాటం వల్లే భవిష్యత్తులో పూర్తవుతాయి తప్ప ఇలా ఏ పార్టీ వచ్చినా పూర్తి చేయలేని పరిస్థితి ఉందని, కావున సిపిఎం ఈ వంతెన పూర్తి చేసే వరకు ఏ పోరాటానికి సిద్ధంగా ఉంటామని తెలిపారు. అలాగే గుమ్మడి గెడ్డ రిజర్వాయర్ పూర్తి, గిరిజన గ్రామాలకు రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో సిపిఎం ఎల్లవేళలా పోరాటానికి సిద్ధంగా ఉంటుందని

గుమ్మలక్ష్మీపురం : రాయగడ జమ్మలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

అన్నారు. ఈరోజు దళితులు, గిరిజనులు, మైనార్టీలు, కార్మికుల, రైతాంగం సమస్యలపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై నికరంగా పోరాడుతున్న సిపిఎం అభ్యర్థులుగా కురుపాం అసెంబ్లీకి మండంగి రమణ, అరకు పార్లమెంటరీ స్థానానికి పాచిపెంట అప్పలనర్స పోటీ చేస్తున్నారని, వీరికి సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అత్యధిక ఓట్లు మెజార్టీతో గెలిపించారు. ప్రచారంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర, జిల్లా కమిటీ సభ్యులు సాంబమూర్తి, నాయకులు ఉపేంద్ర, వెంకటేశ, బలరాం పాల్గొన్నారు.

ఏజెన్సీలో జోరుగా ఎన్నికల ప్రచారం

గుమ్మలక్ష్మీపురం : రానున్న ఎన్నికల్లో ఇండియా బ్లాక్ మద్దతుతో అరకు పార్లమెంటుకు, కురుపాం అసెంబ్లీకి పోటీ చేస్తున్న సిపిఎం ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు పి.అప్పలనర్స, మండంగి రమణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోలక అవినాష్ అభ్యర్థించారు. మండలంలోని రాయగడ జమ్మూ, చాపరాయి బిన్నిడి గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రస్తుత పాలక ప్రభుత్వ విధానాలు, గిరిజనుల పట్ల చూపుతున్న నిరంకుశ వైఖరి, అన్యాయాలను గిరిజనులకు వివరించారు. కేంద్రంలోని బిజెపి రాజ్యాంగానికి విరుద్ధంగా గిరిజనుల హక్కులు, చట్టాలను ఉల్లంఘిస్తుందని విమర్శించారు. మరోవైపు కార్పొరేట్ శక్తులకు కంపెనీల పేరుతో విచ్చలవిడిగా అనుమతిలిస్తూ అడవి నుంచి గిరిజనులను దూరం చేసే కుట్ర జరుగుతుందన్నారు. గిరిజనులకు వెన్నుముకగా ఉన్న జిఒ 3ను రద్దు చేసింన్నారు. అటవీ హక్కుల చట్టం వచ్చి 15 ఏళ్ల దాటినా గిరిజనులకు పూర్తిస్థాయిలో పోడు పట్టాలు మంజూరు చేయలేదన్నారు. గిరిజనులు పండించే జీడి, చింతపండు పంటలకు కనీసం మద్దతు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గిరిజనుల సమస్యలపై నిత్యం సిపిఎం, గిరిజన సంఘాలు పోరాడుతూనే ఉన్నాయన్నారు. గిరిజనుల హక్కులు, చట్టాలను కాపాడుకోవాలంటే గిరిజనులకు అండగా ఉండే సిపిఎం అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించి చట్టసభలకు పంపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.మన్మధరావు, ఎం.శంకరరావు, పువ్వల మోహన్‌రావు, ఎం.సన్యాసిరావు, జిల్లా కమిటీ సభ్యులు మండంగి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి పువ్వల తిరుపతిరావు, మండల నాయకులు పువ్వల గవరయ్య, కద్రక రామస్వామి తదితరులు ఉన్నారు.

కురుపాం : మండలంలోని ఊసకొండ పంచాయతీలోని పలు గిరిజన గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బిజెపి, దాని తొత్తు పొత్తు పార్టీలను ఓడించి సిపిఎం అరకు ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.అప్పలనరసను, కురుపాం అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మండంగి రమణ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, నాయకులు ఆరిక మంగయ్య , బిడ్డిక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో పూతిక వలసలో సిపిఎం ప్రచారంలో దూసుకుపోతుంది. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంగరావు సింహాచలం ఆదివారం ప్రచారం చేపట్టారు సందర్భంగా పొత్తు, తొత్తు పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి, వైసిపిలను ఓడించి, ఇండియా బ్లాక్ బలపర్చిన సిపిఎం పార్లమెంటు అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి సవర చంటిబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని గిరిజనులు కోరారు. అనంతరం పూతిక వలసలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేపట్టారు. ఇండియా బ్లాక్ పొత్తులో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి చంటి బాబుకు హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం అక్కడ గిరిజనులతో సమావేశమయ్యారు.

రెల్లిపేటలో ప్రచారం చేస్తున్న జనసేన అభ్యర్థి మాధవి

యువతకు ఉద్యోగావకాశాలు

జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి

ప్రజాశక్తి-భోగాపురం

ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి అన్నారు. మండలంలోని ముంజేరు పంచాయతీలోని పిట్టపేట, రెల్లిపేట, గాబువానిపేట, సబ్బన్నపేట గ్రామాలలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజుతో కలిసి ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరిద్దరూ ఇంటింటికి వెళ్లి ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వస్తే అనేక పథకాల అమలవుతాయని వివరించారు. వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. నవరత్నాల పేరుతో ప్రజలను నిలువునా దోచుకున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే తీరుతో నియోజకవర్గం పూర్తిగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిటిసి పిడుగు వెంకట సత్యం, మాజీ సర్పంచ్ రామకృష్ణ, పిడుగు చందు, పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

23న సిద్ధం సభ

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఈ నెల 23న జరిగే సిద్ధం సభకు ప్రజలు తరలి రావాలని వైసిపి మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు మీసాల వరహాలనాయుడు కోరారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 23న విజయనగరం సమీపంలోని చెల్లూరు వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం సభకు రానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా చీపురుపల్లి నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కందుల కృష్ణ, ఎల్.ప్రభాత్‌కుమార్, రొబ్బి చిన్ని, బొంతు తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దాడితల్లి సిరిమాను చెట్టు తరలింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

గొల్లపల్లిలోని దాడితల్లి గ్రామదేవత పండుగ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం సిరిమాను చెట్టును తరలించారు. కృష్ణాపురంలో చెట్టును గుర్తించి, పూజలు చేశారు. అనంతరం సిరిమాను చెట్టును కొట్టి ఊరేగింపుగా గొల్లపల్లి తరలించారు. మే 19, 20, 21వ తేదీల్లో గ్రామదేవత పండుగ జరగనుంది. 21న మంగళవారం సిరిమానోత్సవం నిర్వహించనున్నారు.

చంద్రబాబు రోడ్‌షోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి వేపాడ

శృంగవరపు కోటలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సోమవారం చేపట్టే రోడ్‌షోను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు గొంప వెంకటరావు కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. సోమవారం సాయంత్రం చంద్రబాబు రోడ్‌షో నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి మండలంలోని 29 పంచాయతీల టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గురుకుల ప్రవేశ పరీక్షకు 454 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 358 మంది హాజరై పరీక్ష రాసినట్లు ఎటిడబ్ల్యూఒ బి.సురేష్ కుమార్ తెలిపారు.

ఆర్యవైశ్య సంఘాల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా..

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కొత్తవలస

ఆర్యవైశ్యులకు వైసిపి అండగా ఉంటుందని ఆ పార్టీ ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో ఆర్యవైశ్య సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కడుబండి మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కొత్తవలస, ఎస్. కోట పట్టణ కేంద్రాలలో ఆర్యవైశ్య భవనాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా కడుబండి శ్రీనివాసరావు ఆర్యవైశ్య పెద్దలను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో చెరుకూరి నాగరాజు, కొట్యాడ శ్రీను, అనుమాలశెట్టి నానాజీ, పచ్చి పులుసు ఈశ్వరరావు, మామిడి గుప్త, మూర్యూరు నాని, కొత్తవలస వర్తక సంఘం అధ్యక్షులు మూర్యూరి తాత, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, గోరపల్లి శివ, వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, బోధన స్వామి నాయుడు పాల్గొన్నారు.

వైసిపితోనే పేదలకు భవిష్యత్తు

ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కోరాడపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

వైసిపితోనే పేదలకు మంచి భవిష్యత్తు లభిస్తుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఆదివారం మండలం లోని తంగుడుబిల్లి, ఎటి.అగ్రహారం, కోరాడపేట, దన్నానపేట, రామతీర్థం, చంద్రంపేట, టెక్కలి, పారసాం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురేష్‌బాబుతో కలిసి ఆయన మాట్లాడారు. పేదలకు, పెత్తందారులకు జరిగే యుద్ధంలో పేదలు గెలవాలంటే జగన్‌ను గెలిపించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు చనమల్ల వెంకటరమణ, ఎంపిపి అంబళ్ల సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపిపిలు పతివాడ సత్యనారాయణ, సారికి వైకుంఠం నాయుడు, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైసిపి నగర పంచాయతీ అధ్యక్షులు చిక్కాల సాంబ శివరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడ్డుకొండకు మద్దతుగా కుమారుడు

భోగాపురం : వైసిపి నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడుకు మద్దతుగా ఆయన కుమారుడు, యువజన నాయకులు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు ఎన్నికల ప్రచారం చేశారు. వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డితో కలిసి రాజాపులోవ పంచాయతీలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. మూడోసారి బడ్డుకొండ అప్పలనాయుడును ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పడాల శ్రీనివాసరావు, భాను ప్రకాశ్, సుందర హరీష్, కిలారి వెంకటరమణ, వాసుపల్లి రెయ్యుడు, పూడి నూకరాజు, రిక్క అప్పలనరసయ్య, కొయ్య బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
సోమవారం 22 ఏప్రిల్ 2024

కత్తితో గొంతు కోసుకొని

కాంట్రాక్టు లెక్చరర్ ఆత్మహత్య

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి జిల్లా కేంద్రంలోని కొత్తూరు మేజర్ పంచాయతీ ముదిరాజ్ కాలనీలో శనివారం రాత్రి కత్తితో గొంతు కోసుకుని కాంట్రాక్టు లెక్చరర్ బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆ ప్రాంతంలో కలకలం రేపింది. అనకాపల్లి పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం, కొత్తూరు పంచాయతీ ముదిరాజ్ కాలనీకి చెందిన గుత్తికొండ ఉమాదేవి విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలోని తాటిపూడి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. 2011లో వివాహమైనప్పటికీ ఏడాది కాలంలోనే భర్త నుంచి వేరుపడి, జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో కొంతకాలంగా తీవ్ర మనస్తాపంతో ఉన్న ఆమె శనివారం రాత్రి కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతి పలువురిని కలచివేసింది. విషయం తెలుసుకున్న తోటి అధ్యాపకులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఇదిలా ఉండగా భర్త వేధింపుల కారణంగానే తన కుమార్తె బలవన్మరణానికి పాల్పడిందని మృతురాలు ఉమాదేవి తండ్రి స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మృతదేహానికి అనకాపల్లి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాడంగి మండలంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయండి : శంబంగి

ప్రజాశక్తి-బాడంగి

వైసిపి హయాంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి ఓటేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని డొంకినవలస, వీరసాగరం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజాశీర్వాదం కోరారు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో ప్రజలకు చేసిన మంచిని వివరించారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తూచా తప్పకుండా నెరవేర్చారని గుర్తుచేశారు. మళ్లీ సంక్షేమ పాలన రావాలంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు.

బొబ్బిలి : పట్టణంలోని 20వ వార్డులో ఎమ్మెల్యే శంబంగి ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతి గడపకు వెళ్లి వైసిపి ప్రభుత్వం చేసిన మేలును వివరించారు.

గిరిజన గ్రామాల్లో జనసేన ప్రచారం

ప్రజాశక్తి - సీతంపేట

ఉమ్మడి అభ్యర్థి జయకృష్ణ ఆధ్వర్యంలో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు మద్దతుగా మండలంలోని పుబ్బడ, పుబ్బడ గూడ గ్రామాల్లో నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటి ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కోసం ప్రచారం చేశారు. కూటమితోనే గిరిజన సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. గ్లాస్ గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజార్టీతో జయకష్ణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరక పవన్, బి.అప్పారావు, సర్పంచ్ భాస్కర్, బి.ఈశ్వరరావు, కెఎస్ఎస్ బాలరాజు, పాపారావు, శివకృష్ణ, జనార్దన్, శ్రీను, అశ్విని, గంగారాజు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలోని ప్రధానరహదారిలో ఉన్న పురటాల పోలమ్మ ఆలయం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోటి అనురాధ(41) మృతి చెందింది. కొమరాడ మండలం విక్రమపురం గ్రామానికి చెందిన ఈమె భర్త శ్రీనివాసరావుతో కలిసి సరుబుజ్జిలిలో బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పాలకొండలో తమ ముందు వెళు న్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో తలకు బలమైన గాయమైంది. ఈ సంఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ ప్రశాంత్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలోని చినకొండ్రాజుపాలెంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తులు సకాలంలో మంటలు ఆర్పడంతో మిగతా ఇళ్లకు అంటుకోకుండా ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన సూర్ని సన్యాసిరావు ఇంట్లో ప్రమాదవశాత్తూ మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ కాలిపోయాయి. సుమారు ఐదు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు సన్యాసిరావు తెలిపారు.

గడ్డి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని చిలకలపల్లికి చెందిన తప్పిట శ్రీనివాసరావు, రెడ్డి రామనాయుడుకు చెందిన మూడు గడ్డి కుప్పలు ఆదివారం దగ్ధమయ్యాయి. బాధితులు అందించిన వివరాలిలా ఉన్నాయి. చిలకలపల్లికి చెందిన నాయుడు కల్లాల్లో రెడ్డి రామనాయుడుకు చెందిన రెండు గడ్డి కుప్పలు, తప్పిట శ్రీనివాసరావుకు చెందిన ఒక గడ్డి కుప్పకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. వీటి విలువ సుమారు రూ.10వేలు ఉండొచ్చని బాధితులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరారు

గిరిజనుల పాలిట వెలుగు రేఖ సిపిఎం

(మొదటిపేజీ తరువాయి

జరిగింది. పెద్దగెడ్డ ముంపు గ్రామాలను 1నుంచి 5కు పెరిగేటట్టు చేయడంతోపాటు నిర్వాసితులందరికీ న్యాయం జరిగే విధంగా పోరాడింది. ఇప్పటికీ కొంతమందికి పూర్తి న్యాయం జరగకపోవడంతో పోరాటం కొనసాగిస్తోంది. ప్రస్తుతం కురుపాం గిరిజన ఇంజినీరింగ్ కాలేజీ భూ నిర్వసితులకు న్యాయం చేయాలని పోరాడుతోంది. కొమరాడ మండలం కోటిపాం ప్రాంతంలో కాలుష్యకారక థర్మల్ విద్యుత్ కర్మాగారానికి వ్యతిరేకంగా పోరాడి నిలువరించగలిగింది. నాడు ఇందుకోసం సేకరించిన భూములను రైతులకు తిరిగి ఇవ్వాలనే డిమాండ్తో పోరాడుతోంది. గిరిజనులు సాగుచేసుకుంటున్న పాచిపెంట మండలం కుడుమూరులోని మొకాసా భూములను గిరిజనేతరులు ఆక్రమించుకోవడాన్ని నిలువరించింది. దీంతో, ప్రస్తుతం ఆయా భూములన్నీ గిరిజనుల ఆదీనంలోవున్నప్పటికీ పాలకులు నేటికీ ఆక్రమణ దారులకు కొమ్ముకాస్తునే ఉన్నారు. గరుగుబిల్లి మండలం పోలినాయుడు వలసలో 1200ఎకరాల ఇనాం భూములను పెత్తదారులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించడంతో పెద్దఎత్తున పోరాడింది. మెంటాడ మండలం గిరిజనుల సాగులోవున్న వందలాది ఎకరాలను గిరిజనేతర పెత్తందారులు ఆక్రమిత చర్యలను అడ్డుకుని పట్టాల కోసం పోరాడుతోంది. సిపిఎం పోరాటంతో సాలూరు శిఖపరువులో అక్రమంగా తలపెట్టిన మాంగనీస్ తవ్వకాలు, మండలంలోని తామరకొండ, పార్వతీపురం మండలంలోని బోడికొండపై గ్రానైట్ తవ్వకాలు నిలిపివేయాలని గిరిజనులు, గిరిజనేతరులను పెద్ద ఎత్తున కదిలించి పోరాడింది. సవర భాషా విద్యావాలంటీర్లను కొనసాగించాలని, జివో నెంబర్ -3ని పునరుద్ధరించి గిరిజన ప్రాంతంలో 100శాతం ఉద్యోగాలను గిరిజనులతో భర్తీచేయాలని పోరాడుతోంది. నాటి చంద్రబాబు ప్రభుత్వంపై పోరాడి మరెక్కడా లేనంతగా ఏజెన్సీలోని గిరిజన వికాస స్కూళ్లు మూతపడకుండా చేసింది. రేషనలైజేషన్ పేరుతో 3కిలో మీటర్ల పరిధిలోవున్న 30మంది విద్యార్థుల కన్నా తక్కువగా ఉన్న సూళ్లను మూసివేయాలన్న చంద్రబాబు ప్రభుత్వ నిర్ణయాన్ని కూడా మన్యంలో సిపిఎం తిప్పికొట్టింది. పార్వతీపురంలోని వెంకటేశ్వర డిగ్రీ కాలేజీని ప్రభుత్వరంగంలోకి విలీనం చేయాలన్న డిమాండ్తో సిపిఎం చేసిన సుదీర్ఘపోరాటం ఫలించింది. నేడు ఆ కాలేజీయే పేద, గిరిజనులకు చదువుల తల్లిగా మారింది.

అరకు అనంతగిరి ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలను అడ్డుకోవడంతో విజయనగరం జిల్లా ఎస్.కోట గిరిజన ప్రాంతానికి ఆనుకునివున్న జిందాల్ అల్యూమినా కంపెనీ నిర్మాణం జరగలేదు. దీంతో, అప్పట్లో భూములు కోల్పోయిన గిరిజనులకు తిరిగి అప్పగించాలని సిపిఎం పోరాడుతోంది. ఇదే విషయమై రెండు నెలల క్రితమే సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి తమ్మినేని కూడా మూలబొడ్డవర పరిధిలోని గిరిజన గ్రామాల్లో పర్యటించారు. ఇలా ఎన్నో సమస్యలపై పోరాడింది. విజయాలు సాధిస్తోంది. మరిన్ని సమస్యల పరిష్కారానికి పోరాడుతునే ఉంది. తాజా ఎన్నికల్లో అరకు పార్లమెంట్ స్థానం, దాని పరిధిలోవున్న కురుపాం నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థులు పోటీకి దిగడంతో ఆ పార్టీ చరిత్ర, పోరాటలు జనంలో చర్చనీయాశంగా మారుతున్నాయి.

భోగాపురం ఎయిర్పోర్టుకు రూ.70 కోట్లతో నీటి సరఫరా

(మొదటిపేజీ తరువాయి

బావులు నుంచి విమానాశ్రయానికి 14 కిలో మీటర్లు పైపులైన్లు పనులు జరుగుతున్నాయి.

శరవేగంగా చంపావతి నదిలో బావుల నిర్మాణం

మాలనందిగాం వద్ద చంపావతి నదిలో రెండు బావుల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే చేపలకంచేరు వెళ్లే రహదారి నుంచి బమ్మిడిపేట, రామచంద్రపేట వరకు సుమారు 6కిలో మీటర్లు పైపులైన్లు పనులు కూడా పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం చంపావతి నదిలోని బావులు నుంచి మాల నందిగాం, నందిగాం మీదుగా ఉప్పుగెడ్డ వరకు పైపులైన్లు వేసేందుకు పైపులు డంపింగ్ చేశారు. పైపులను తిరుపతి సమీపంలో కంపెనీ నుంచి కొనుగోలు చేస్తున్నారు. భోగాపురం గ్రామీణ నీటి సరఫరా విభాగం డిఇ వైకుంఠం నాయుడు నేతృత్వంలో ఒక బృందం కూడా ఇక్కడ నుంచి నేరుగా కంపెనీకి వెళ్లి పైపుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించాకే అనుమతులు ఇచ్చారు.

ఆగస్టు నెలాఖరుకు పనులు పూర్తి చేయాలని నిర్ణయించాం

విమానాశ్రయానికి తాగునీటి సరఫరా పనులు ఆగస్టు నెలలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మొదటి విడత కింద 28కోట్లతో మాల నందిగాం వద్దనున్న చంపావతి నదిలో బావుల నిర్మాణం జరుగుతోంది. అలాగే పైపులైను పనులు మాల నందిగాం నుంచి ఉప్పుగెడ్డ వరకు పెండింగు ఉన్న పైపులైను పనులు కూడా ప్రారంభించాం. రెండో విడతలో తారకరామ తీర్థసాగర్ నుంచి నీటిని అందించనున్నాం.

జమ్ము వైకుంఠనాయుడు,
ఆర్డబ్ల్యుఎస్, డిఇ, భోగాపురం

రిసెప్షన్ సెంటర్ల వద్ద పక్కా ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి

సమీక్షించారు. లెండి కళాశాలలో రాజాం, చీపురుపల్లి, గజపతినగరం, నెల్లిమర్ల, శృంగవరపుకోట నియోజకవర్గాలు, జెఎన్టియుజివిలో బొబ్బిలి, విజయనగరం నియోజక వర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రిసెప్షన్ కౌంటర్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధులను సిబ్బందికి సూచించారు. పర్యటనలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ ఎస్డి అనిత, ఆర్డిఒ ఎంవి సూర్యకళ, ఆయా కేంద్రాల నోడల్ అధికారులైన మెప్మా పీడీ ఎం.సుధాకరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, ఎస్సి కార్పొరేషన్ ఇడి సుధారాణి, డిప్యుటీ సిఇఒ కె.రాజ్కుమార్, జెడ్పి సిఇఒ శ్రీధర్ రాజా, డిఎస్ఒ మధుసూదన రావు, సివిల్ సప్లయిస్ డిఎం మీనా కుమారి, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, రెవెన్యూ అధి కారులు, సిబ్బంది పాల్గొన్నారు

CHANGE OF NAME

I **N. Nagamani W/o Maheswararao Netheti,** Residing at Garudabilli Village & Post, Bondapalli Mandalam, Vizianagaram District, Andharapradesh Pin - 535260. My name was wrongly Publication in Pt-II order N Nagamani insteads of my correct name is **NETHETI NAGAMANI W/o Maheswararao Netheti** (New Name) hence forth I am being Called as **NETHETI NAGAMANI** (New name) for all purpose.

మహారాజశ్రీ విజయనగరం జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జికోర్టు విజయనగరం
HMOP : 184/2023

Between:
యడ్ల భవాని @ చోక్కకుల భవాని ...వాది/పిటిషనర్
And:
చోక్కకుల రామకృష్ణ ....ప్రతివాది/రెస్పాండెంట్
To
చోక్కకుల రామకృష్ణ, S/o కొండబాబు, వయస్సు 30 సం॥, హిందూ, R/o చంద్రంపేట గ్రామం, కంగాడ పంచాయతీ, జామి మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు గల కోర్టుయందు పిటిషనర్ కేసు నమోదు చేయ్యగా శ్రీ కోర్టువారు పిటిషనర్కు ఆర్డరు జారీ చేసిన ప్రకారము పలుమారు నోటీసులు పంపించిననూ మీరు తీవ్ర జాప్యం చేయ్యడం వలన తిరస్కరించుట వలన తేది 10-05-2024న వాయిదా కలదని ఈ నోటీసు పత్రికా ముఖంగా మీకు తెలియజేయమని శ్రీ కోర్టువారు ఆర్డరు వేసియున్నారు. కావున వాయిదా రోజున అనగా **తేది 10-05-2024 ఉదయం 10-30 ని॥**లకు మీరుగాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టునకు హాజరై మీ వాదనను తెలియజేయవలెను. లేని యెడల శ్రీ కోర్టువారు మీకు పరోక్షమున తీర్మానించుదరని ఇందుమూలంగా తెలియజేడమైనది.

ఇట్లు
యల్.శంకరరావు
అడ్వకేట్, విజయనగరం,
సెల్: 9966565557

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT KOTHAVALASA
O.S.20/2022

Between:
Reddi Mary Vijaya Kumar .....Plaintiff
And:
Gorripotu Krishna and others .....Defendants
To
Gorripotu Krishna S/o Ramunaidu, Jammadevipeta Village, L.Kota Mandal, Vizianagaram District.

Whereas the above named Plaintiff has instituted a suit against you, you are hereby summons to appear befoe the above court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by any person able to answer all such questions on **20th day of June, 2024 at 10-30 AM** to answer the claim and at the day fixed for your appearance for final disposal of the suit, you must be prepared and produce on that day all the witnesses upon whose evidence and all the documents upon which you intend to relied in support of your defense in the above suit.

Take summons that in default of your appearance pn that day; the above suit will be heard and determined in your absence.

GALI ESWARARAO,
ADVOCATE,
Arigipalem Village,
Sompuram Post, L Kota S.O,
Vizianagaram District.
Cell No.9440110309

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
సోమవారం
22 ఏప్రిల్ 2024

స్థానిక సమస్యల ఊసేది?

సంక్షేమ పథకాలంటూ వైసిపి... మేనిఫెస్టోతో జనసేన ప్రచార హోరు

జంపరకోట జలాశయం నిర్మించాల్సింది ఇక్కడే

ప్రజాశక్తి-పాలకొండ

ప్రస్తుత ఎన్నికల ప్రచారం ప్రధాన పార్టీల అభ్యర్థులు స్థానిక సమస్యలపై కనీసం ప్రస్తావించడం లేదు. వైసిపి ఎమ్మెల్యే వి.కళావతితో పాటు జనసేన అభ్యర్థిగా ఉన్న నిమ్మక జయకృష్ణ, ఇతర అభ్యర్థులు స్థానిక సమస్యలపై మాట్లాడుతున్న దాఖలాల్లేవు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమం చూసి ఓటు వేయాలని వైసిపి అభ్యర్థి కోరుతుండగా, జనసేన అభ్యర్థి జయకృష్ణ తమ మేనిఫెస్టోతో ప్రచారం చేస్తున్నారు. అంతే తప్ప స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని గానీ, ఈప్రాంత అభివృద్ధికి ఏం చేస్తామో అన్నదీ ప్రకటించకపోవడం పట్ల స్థానికులు పెద్దఎత్తున విమర్శలు గుప్పిస్తున్నారు. స్థానిక సమస్యలపై ఎక్కడా కూడా పెదవి విప్పడం లేదు. నియోజకవర్గంలో ప్రధానంగా తోటపల్లి ఎడమ కాలువ, జంపరకోట జలాశయం పనులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాల్సిన పరిస్థితి ప్రభుత్వంపై ఉంది. అలాగే నియోజకవర్గంలో విద్యార్థుల ఉన్నత చదువుల కోసం పిజి కళాశాల, ఇంజినీరింగ్ కాలేజీలు లేవు. నియోజకవర్గ కేంద్రంలో కనీసం ఐటిఐ కళాశాల కూడా లేదు. పట్టణంలో డంపింగ్ యార్డ్ సమస్య తీవ్రంగా ఉంది. ప్రస్తుత డంపింగ్ యార్డ్ వల్ల పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలానే పట్టణంలో రైతు బజార్, మెయిన్ రోడ్డు విస్తరణ, ఇంటింటికి తాగు నీరు అందించే విషయాల్లో కూడా తీవ్ర నిర్లక్ష్యం నెలకొంది. పట్టణంలో అభివృద్ధి అనే మాట చెప్పడానికి కూడా ఏమీ లేని పరిస్థితి నెలకొంది. అలానే గిరిజన ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి పడుతున్న ఇబ్బందులు, సీతంపేటలో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నిర్మించకపోవడం, పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడం వంటివి ఉన్నాయి. గిరిజనులు పండించిన పంటలకు కనీసం కోల్డ్ స్టోరేజ్ కూడా ఏర్పాటు చెయ్యలేదు. వీరఘట్టం మండలంలో అభివృద్ధి పనులు పడకవేశాయి. భామిని మండలంలో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి కాకపోవడంతో అక్కడి రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఇన్ని సమస్యలు నియోజకవర్గంలో ఉన్నా కూడా అభ్యర్థులు కనీసం వీటిపై ఎక్కడా హామీ ఇవ్వకపోవడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

హామీని మరిచారు

జంపరకోట పూర్తయ్యేదెప్పుడో..?

మండలంలో కొన్ని దశాబ్దాలుగా నిలిచిపోయిన జంపరకోట ప్రాజెక్టు పనులను తమ ప్రభుత్వ హయాంలో పూర్తి చేస్తామని వైసిపి, టిడిపి ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. దీంతో రైతుల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో 2వేల ఎకరాలకు సాగు నీరందించే ఈ ప్రాజెక్టు పనులు కొంతకాలంగా నిలిచిపోయాయి. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు రూ.8కోట్లు నిధులు విడుదల చేశారు. అయితే నిర్వాసితుల సమస్యతో పాటు సకాలంలో ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయకపోవడంతో ప్రాజెక్టు వ్యయం రూ.20 కోట్లకు పెరిగింది. దీంతో ప్రాజెక్టు పనులు మధ్యలోనే నిలిచి పోయాయి. 2019 ఎన్నికల్లో తాను ఎమ్మెల్యేగా గెలిచి, తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తే ఎల్ఎల్ పురం, గుడివాడ, కోటిపల్లి, ఓని తదితర గ్రామాల్లో రైతులకు ఎంతో మేలు జరిగి ఉండేది. ప్రాజెక్టు నిర్మాణం కాకపోవడంతో రైతులు వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు.

వాసిరెడ్డి కుటుంబం.. రాజకీయాలకు దూరం

ప్రజాశక్తి-బొబ్బిలి

2009లో నియోజకవర్గాల పునర్విభజనలో తెర్లాం నియోజకవర్గాన్ని తొలగించిన విషయం తెలిసిందే. తెర్లాం నియోజకవర్గ పరిధిలోని తెర్లాం, బాడంగి మండలాలను బొబ్బిలి నియోజకవర్గంలో విలీనం చేశారు. దీంతో వాసిరెడ్డి కుటుంబం రాజకీయాలకు దూరమైంది. తెర్లాం నియోజకవర్గంలో వాసిరెడ్డి, తెంటు కుటుంబాల మధ్య రాజకీయ యుద్ధం జరిగేది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వాసిరెడ్డి వరద రామారావు, తెంటు జయప్రకాశ్ మధ్య హోరాహోరీగా పోటీ ఉండేది. బొబ్బిలి నియోజకవర్గంలో తెర్లాం విలీనం కావడంతో 2009లో జరిగిన ఎన్నికల్లో తెంటు జయప్రకాశ్ కుమారుడు తెంటు లక్ష్మునాయుడుకు టిడిపి టికెట్ ఇచ్చింది. అప్పటి మాజీ ఎమ్మెల్యే వాసిరెడ్డి వరద రామారావుకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వకుండా.. అప్పటికే బొబ్బిలి సిట్టింగ్ ఎమ్మెల్యే సుజయకృష్ణ రంగారావుకు టికెట్ ఇచ్చింది. బొబ్బిలి నియోజకవర్గ రాజకీయాల్లో తెంటు లక్ష్మునాయుడు కీలకపాత్ర పోషిస్తున్నారు. కానీ, వాసిరెడ్డి కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాలలో క్రియాశీలకంగా పనిచేయడం లేదు. బొబ్బిలిలో విలీనం అనంతరం వాసిరెడ్డి కుటుంబం పూర్తిగా నియోజకవర్గంలో ప్రభావం కోల్పోయి, సొంత గ్రామం పినపెంకి రాజకీయాలకు పరిమితమైంది. 1978, 1999 ఎన్నికల్లో వాసిరెడ్డి వరద రామారావు, 1983, 1985, 1989, 1994, 2004 ఎన్నికల్లో తెంటు జయప్రకాశ్ ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 2008 జనవరిలో తెంటు జయప్రకాశ్ మరణించడంతో తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన కుమారుడు తెంటు లక్ష్మునాయుడు విజయం సాధించారు. బొబ్బిలి నియోజకవర్గం నుంచి తెంటు లక్ష్మునాయుడు టిడిపి అభ్యర్థిగా 2009, 2014లో పోటీ చేసి, ఓటమి పాలయ్యారు. వాసిరెడ్డి రామారావు మరణం తర్వాత ఆయన కుమారుడు పినపెంకి రాజకీయాలకు పరిమితమయ్యారు.

వాసిరెడ్డి వరద రామారావు (ఫైల్)

టిడిపి ఎమ్‌పి అభ్యర్థి ఎక్కడ?

ఫ్లెక్సీల్లో కానరాని కలిశెట్టి ఫొటోలు

కలిశెట్టి అప్పలనాయుడు ఫొటో లేని ఫ్లెక్సీ

ప్రజాశక్తి-చీపురుపల్లి

టిడిపి విజయనగరం ఎమ్‌పి అభ్యర్థిగా కలిశెట్టి అప్పలనాయుడును ఆ పార్టీ అధిష్టానం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. రోజులు గడుస్తున్నా ఆయన ఆచూకీ చీపురుపల్లి నియోజకవర్గంలో ఇంతవరకు కానరావడం లేదంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పోనీ స్థానిక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఫ్లెక్సీలో కూడా కలిశెట్టి అప్పలనాయుడు ఫొటో ఎక్కడా కనబడలేదు. మరోవైపు స్థానిక టిడిపి నాయకులు ప్రచారం నిర్వహించే సమయంలో కలిశెట్టి అప్పలనాయుడు పేరు ఎక్కడా ప్రస్తావించక పోవడం గమనార్హం. దీంతో టిడిపి శ్రేణుల్లో అయోమయం నెలకొంది. గ్రూపు రాజకీయాల్లో భాగంగా కావాలనే ఇదంతా చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గిరిజనుల కష్టాలు తీరేదెన్నడో?

అది 19 ఏళ్ల నాటి కల. ఏళ్లు గడుస్తున్నా..పాలకులు మారుతున్నా ఆ ప్రాంత గిరిజనుల కల మాత్రం సాకారం కావడం లేదు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ అదే ఎజెండా. అధికారం మారుతోంది. అందలం ఎక్కిన వారు ఎక్కుతున్నారు. కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. అదే కొమరాడ మండలంలోని పూర్ణపాడు - లాబేసు వంతెన. గిరిజన సమస్యల పట్ల పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. 2004లో సిపిఎం ఎమ్మెల్యే ఆనాడు అసెంబ్లీలో ఈ వంతెన సమస్యను ప్రస్తావించారు. అలా కార్యరూపం దాల్చిన ఈ వంతెన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చినా టిడిపి, వైసిపి పాలనలో నేటికీ పూర్తి కాలేదు. సిపిఎం, వామపక్షాలు మాత్రం ఈ వంతెన సాధన కోసం నేటికీ పోరాటాలు చేస్తూనే ఉన్నాయి. మరోసారి ఎన్నికల వేళ పూర్ణపాడు - లాబేసు వంతెన చర్చనీయాంశమవుతోంది.

అనారోగ్యానికి గురైన బాలికను నది దాటిస్తున్న గిరిజనులు (ఫైల్)

- ఎన్నికల హామీగానే పూర్ణపాడు- లాబేసు వంతెన
- పట్టించుకోని టిడిపి, వైసిపి పాలకులు
- 19 ఏళ్లయినా పూర్తికాని వైనం
- 40 గ్రామాల సమస్యపై తీవ్ర నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కొమరాడ

కొమరాడ మండలంలో తరతరాల నుండి నాగావళి నది దాటేందుకు ప్రజలు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. 1996లో ఎబి సరిహద్దు ప్రాంతమైన వత్తాడ-రెబ్బ సమీపంలో నాగావళి నదిలో నాటు పడవ మునిగిపోయి 36 మంది నదిలో సమాధి అయిన ఘటన ఇప్పటికీ ఆ ప్రాంత ప్రజల కళ్లముందు కదలాడుతూ ఉంటుంది. కొమరాడ మండలంలో తొమ్మిది పంచాయతీల ప్రజలు నాగావళి నది ఆవల ఉన్న గ్రామాల్లో జీవనం సాగిస్తున్నారు. వారికి ఏ చిన్న కష్టం వచ్చినా, అవసరం వచ్చినా నాగావళి నది దాటుకుంటూ కొమరాడ రావలసిన పరిస్థితి ఉంటుంది. అయితే శీతాకాలం, వేసవి కాలంలో నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండడంతో గిరిజనుల రాకపోకలకు కొంత అనుకూలంగా ఉంటుంది. ప్రతి ఏటా జూన్ నుంచి డిసెంబర్ వరకు వర్షాలు భారీగా పడడంతో నాగావళి నది నీటి ప్రవాహం పెరిగి ఉగ్రరూపం దాల్చుతుంది. ఆ సమయంలో నదిని దాటడమంటే గిరిజనులు ప్రాణాలకు తెగించాల్సిందే. అప్పుడప్పుడు మర పడవ సహాయంతో నది దాటేందుకు ప్రజలు ప్రయత్నిస్తుంటారు. నదీ ప్రవాహం అధికంగా ఉంటే పడవ రాకపోకలు నిలిచిపోతాయి. రోగులు అత్యవసర పరిస్థితుల్లో గత్యంతరం లేక నదిలో ప్రమాదకరంగా రాకపోకలు చేయాల్సిన దయనీయ పరిస్థితి. కొన్నిసార్లు పడవపై కూడా అత్యధికమంది ప్రయాణం చేయడంతో కొన్ని సందర్భాల్లో పడవ బోల్తా పడిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

సిపిఎం ఎమ్మెల్యే ప్రస్తావనతో..

అది 2005 డిసెంబరు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతున్న సమయం. అప్పటిలో నాగూరు సిపిఎం ఎమ్మెల్యేగా ఉన్న కోలక లక్ష్మణమూర్తి అసెంబ్లీలో పూర్ణపాడు - లాబేసు వంతెన సమస్యను లేవనెత్తారు. అప్పటి గిరిజనశాఖ మంత్రి నిధుల కేటాయింపు సాధ్యం కాదన్నప్పుడు కోలక దీనివల్ల ప్రయోజనాలను క్షుణ్ణంగా వివరించారు. 1996లో వత్తాడ - రెబ్బ వద్ద పడవ మునిగి 32 మంది గిరిజనులు చనిపోయిన విషయాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. చివరికి ప్రభుత్వం హామీ ఇస్తూ.. పూర్ణపాడు - లాబేసు మధ్య వంతెన నిర్మించాలని నిర్ణయించింది. తొలుత రూ.2.5 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. ఏడాది తర్వాత ఆ ఏడాది సెప్టెంబర్‌లో అప్పటి మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కానీ పనులు మాత్రం ముందుకు సాగలేదు. అనంతరం రూ.2.5 కోట్ల నుంచి రూ.నాలుగు కోట్లకు అంచనాలు పెంచి, ఆర్అండ్‌బికి నిర్మాణ బాధ్యత అప్పగించారు. మళ్లీ టెండర్లు పిలిచినా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత మరోసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో పంచాయతీరాజ్‌శాఖా మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణను సిపిఎం నాయకులు కలిసి సమస్యను వివరించారు. ఈసారి మరోసారి అంచనా విలువ రూ.6 కోట్లకు పెరిగింది. పనులు మాత్రం ఒక్క అంగుళం కూడా ముందుకు కదల్లేదు. టిడిపి అధికారంలోకి వచ్చాక మళ్లీ ప్రతిపాదనలు పెంచి ఈసారి రూ.9.98 కోట్లకు అంచనా వ్యయం పెంచారు. మళ్లీ శంకుస్థాపన చేసిన పనులు ప్రారంభించారు. అప్పటి ఒప్పందం ప్రకారం 2017 మే నాటికి ఈ పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ ఆ దిశగా పనులు చేయలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో వంతెన పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి. పాలకుల నిర్లక్ష్యం కారణంగా సుమారు రూ.3కోట్లు వరకు ఐఎపి నిధులు వెనక్కి వెళ్ళిపోవడంతో వంతెన నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయింది. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నిర్మాణంపై పూర్తిగా దష్టి సారించలేదు. వైసిపి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన పుష్పశ్రీవాణి ఈ వంతెన గురించి కనీసం పట్టించుకోలేదు. సిపిఎం తోపాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు నిరసనలతో అప్పట్లో మరో మూడు కోట్లు నిధులు అదనంగా కేటాయించామని, పనులు ప్రారంభిస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో ఇసుమంతైనా పని జరగలేదు. వంతెన పూర్తయి తమ కష్టాలు తీరుతాయని ఆశపడ్డ గిరిజనులకు తీవ్ర నిరాశ మిగిలింది.

ఎన్నికల హామీగా మిగిలిపోతున్న వంతెన

ఎన్నికలు వచ్చిన ప్రతిసారి వంతెన పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం పాలకులకు పరిపాటిగా మారింది. చివరికి ఇది ఎన్నికల హామీగా మిగిలిపోతుందని గిరిజనులు అంటున్నారు. అధికారంలోకి వస్తే వంతెన పూర్తి చేస్తామని టిడిపి వైసిపి ప్రభుత్వాలు ప్రచారాలు చేసుకొని పబ్బం గడుపుకుంటున్నాయి తప్ప వంతెన నిర్మాణం మాత్రం పూర్తి చేయడం లేదు.

40 గ్రామాలకు ప్రయోజనం

వంతెన పూర్తయితే ఆ మండలంలోని 10 పంచాయతీలకు చెందిన 40 గ్రామాలతోపాటు కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, గరుగుబిల్లి మండలాల్లో అనేక గ్రామాలకు రాకపోకలకు వీలు ఏర్పడుతుంది. కొంత కాలం పనులకు టెండర్లు పిలవకుండా కాలక్షేపం చేశారు. మరికొంత కాలం నిధులు చాల్లేదని చెప్పారు. నిధులు మంజూరైనా కమీషన్లు కుదరక కొన్నాళ్లు పనులు నిలిచిపోయాయి. చివరకు కాంట్రాక్టర్ తనకు ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదంటూ పనులు నిలిపివేసి అక్కడి నుంచి చిత్తగించారు. దీంతో వంతెన నిర్మాణం నిలిచిపోయింది.

పట్టించుకోని ఎమ్మెల్యేలు

1978 నుంచి 2004లో సిపిఎం ఎమ్మెల్యే మినహా అంతకముందు, తర్వాత చినమేరంగి కోట నుంచే ఎమ్మెల్యేలు గెలుపొందుతున్నా, ఈ వంతెన నిర్మాణంపై దృష్టి సారించలేదు. వంతెన శంకుస్థాపన చేసిన అప్పటి మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, అంతకు ముందు ఎమ్మెల్యేగా గెలిచిన జనార్ధన థాట్రాజ్, ప్రస్తుతం కురుపాం ఎమ్మెల్యేగా ఉన్న పుష్పశ్రీవాణి ఇలా ఒకే కుటుంబం నుంచి అధికారం చేపడుతున్నా, లక్షలాది ప్రజలకు సమస్యగా ఉన్న ఈ వంతెన నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తిగా నిలిచిపోయిన పూర్ణపాడు-లాబేసు వంతెన

వైసిపి వచ్చాక చిన్న పని కూడా చేయలేదు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లయినా వంతెన నిర్మాణం కోసం చిన్నపని కూడా చేపట్టలేదు. ఎమ్మెల్యేగా పుష్పశ్రీవాణి పదేళ్లుగా ఉన్నా పట్టించుకోలేదు. అధికారంలోకి వచ్చాక పూర్తి చేస్తామన్న ఎమ్మెల్యే మాట తప్పారు. తొమ్మిది పంచాయతీల ప్రజలకు అవసరమైన వంతెన నిర్మాణం తక్షణమే పూర్తి చేస్తే గిరిజనులకు ఉపయోగకరంగా ఉంటుంది.

- బిడ్డక తమ్మయ్య, అల్లువాడ గ్రామం

వంతెన లేక రాకపోకలకు ఇబ్బందులు

దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు- లాబేసు వంతెన నిర్మాణం జరగకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా వర్షాకాలంలో నదిని దాటుకొని కొమరాడ మండల కేంద్రానికి వివిధ పనుల కోసం రావాలంటే అనేక అవస్థలు పడాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలి.

- నాలి గుంపస్వామి, పూజారిగూడ గ్రామం

ఒప్పకున్నాక తప్పదుగా!

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఒప్పుకున్న పెళ్లికి వాయించక తప్పదు బాజాలు అన్న చందంలా ఉంది మండలంలో టిడిపి పరిస్థితి. నియోజకవర్గంలో బలమైన ప్రతిపక్షంగా ఉన్న టిడిపి.. పొత్తులో భాగంగా నెల్లిమర్ల అసెంబ్లీ సీటును జనసేనకు కేటాయించింది. దీంతో ఆ పార్టీ నాయకులు తప్పని పరిస్థితుల్లో జనసేన తరుపున ప్రచారం చేస్తున్నారు. అంతే గాని మనుషులు కలిసినట్లు మనసులు కలవలేదని ఇటీవలి నామినేషన్ ఘట్టంలో కొన్ని సంఘటనలు వ్యక్తమౌతున్నాయి. ఎందుకంటే నామినేషన్ కార్యక్రమానికి భారీగా జనాలను తరలించినా వారికి కనీసం తాగునీరు కూడా అందించలేదని, వచ్చిన జనాలను పట్టించుకోలేదన్న చర్చ సాగుతోంది. టిడిపికి సీటు ఇవ్వకపోవడంతో ఇప్పటికే ఆ పార్టీ శ్రేణులు నిరాసక్తతతో ఉన్నట్లు సమాచారం. అంతే కాకుండా 40 సంవత్సరాలుగా ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని పార్టీని, కార్యకర్తలను కాపాడుకుంటూ వస్తున్న నాయకులను జనసేన సమన్వయం చేసుకోవడంలో లోపం కనిపిస్తోంది. గ్రామస్థాయి నుంచి బలమైన కేడర్ ఉన్న టిడిపిని పట్టించుకోకుండా అధినాయకుడు పొత్తులో భాగంగా నెల్లిమర్ల అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు. అధినేతకు ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపు కోసం టిడిపి శ్రేణులు కృషి చేస్తున్నారు. కానీ జనసేన వ్యవహరిస్తున్న తీరు వల్ల టిడిపి కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారని సమాచారం. ఇప్పటికైనా జనసేన తీరు మార్చుకోకపోతే ఇబ్బందులు తప్పవని చర్చ సాగుతోంది.

బంధుత్వంలో వైరత్వం

ప్రజాశక్తి-రేగిడి

కిమిడి కళావెంకటరావు, పాలవలస రాజశేఖరం.. ఇద్దరూ నియోజకవర్గ రాజకీయాల్లో దశాబ్దాల పాటు చక్రం తిప్పిన నేతలు. ఈ రెండు కుటుంబాలకు మంచి బంధుత్వం కూడా ఉంది. అదే సమయంలో దశాబ్దాల పాటు రాజకీయ ప్రత్యర్థులు కావడం విశేషం. ఒకప్పటి ఉణుకూరు నియోజకవర్గం బిసి రిజర్వేషన్లు అయిన తరువాత 1983 నుంచి 2004 ఎన్నికల వరకు చెరోసారి మినహా వీరిద్దరే రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్నారు. 1983 నుంచి ఉణుకూరు నియోజకవర్గంలో టిడిపి తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా కిమిడి కళా వెంకట్రావు పోటీ చేయగా, పాలవలస రాజశేఖరం కాంగ్రెస్ తరపున బరిలో నిలిచారు. ఆ ఎన్నికల్లో కళావెంకట్రావు గెలుపొందారు. 1985లో కాంగ్రెస్ నుంచి కెంబూరు ఆనందరావు బరిలో నిలవగా ఆయనపై కళావెంకటరావు విజయం సాధించారు. 1989, 2004 ఎన్నికల్లో టిడిపి తరపున కిమిడి కళా వెంకట్రావు.. కాంగ్రెస్ అభ్యర్థి పాలవలస రాజశేఖరంపై గెలుపొందారు. 1994లో కాంగ్రెస్ తరపున పాలవలస రాజశేఖరం పోటీ చేసి, ప్రత్యర్థి కళావెంకటరావుపై విజయం సాధించారు. 1999లో కళావెంకటరావు సోదరుడు కిమిడి గణపతిరావు టిడిపి తరపున పోటీచేసి, కాంగ్రెస్ అభ్యర్థి పాలవలస రాజశేఖరంపై గెలుపొందారు. 2009 నుంచి ఉణుకూరు నియోజకవర్గం కనుమరుగైంది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా రాజాం నియోజకవర్గం ఎస్‌సి రిజర్వుగా మారింది. అనంతరం కళావెంకట్రావు ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆయన చీపురుపల్లి టిడిపి అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన కళావెంకటరావు విద్యుత్తు, హోంశాఖ మంత్రిగా పనిచేశారు.

కళావెంకటరావు

రాజశేఖరం

ఇంటి గోడపై సిఎం జగన్, ఎమ్మెల్యే శ్రీవాణి ఫొటోలతో ఉన్న చిత్రం

ఇక్కడ కోడ్ వర్తించదా?

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎన్నికల కోడ్ వచ్చి నెలరోజులవుతున్నా గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో అధికారులు ఎన్నికల కోడ్ నిబంధనలు సరిగా పాటించడం లేదు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిపిఎం నాయకులు బాతుగుడబ, కొండు కుప్ప గ్రామాలకు వెళ్లగా ప్రతి ఇంటి వద్ద గోడకు సిఎంజగన్మోహన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి ఫొటోలు దర్శనమిస్తున్నాయి. మారుమూల ప్రాంతం కదా ఎవరు వస్తారులే? ఎవరు చూస్తారులే? అనే అపోహ అధికారుల్లో స్పష్టంగా కనిపిస్తున్నట్లు ఉంది. ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

చినమేరంగి కోట నుంచి 4 సార్లు ఎమ్మెల్యేగా శత్రుచర్ల

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో ఆనాటి నాగూరు నేటి కురుపాం నియోజకవర్గం చరిత్రలో చినమేరంగికోటకు చెందిన శత్రుచర్ల విజయరామరాజు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1978లో మొదటిసారిగా రాజకీయాలకు వచ్చిన ఆయన కాంగ్రెస్ తరపున పోటీ చేసి ప్రత్యర్థి (జనతా) వైరిచర్ల సిసిడిపై 1533 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. 1983లో రెండోసారి కాంగ్రెస్ తరపున పోటీచేసి ప్రత్యర్థి పి.సోమందొర (కాంగ్రెస్ ఎస్) 623 ఓట్లతో గెలుపొందారు. 1985లో టిడిపి అభ్యర్థి వి.భారతిపై 3941ఓట్లతో, 1999లో టిడిపి అభ్యర్థి నిమ్మక జయరాజు పై 6917 ఓట్లతో విజయం సాధించారు.

పట్టణంలో కానరాని స్వచ్ఛత

- ఏ కాలువ చూసినా వ్యర్థాలమయమే
- పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెడుతున్నాం : కమిషనర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంలో ఎక్కడా స్వచ్ఛత కానరావడం లేదు. ఆయా వార్డుల్లో పారిశుధ్య నిర్వహణపై స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ ప్రజారోగ్య విభాగం అధికారులు, సిబ్బంది, సచివాలయాల శానిటరీ కార్యదర్శుల కనీసం దృష్టి సారించడంలేదని స్థానిక ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.పట్టణ జనాభా 62 వేలు దాటి ఉంది. ఈ జనాభాకు అనుగుణంగా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న ప్రజారోగ్య విభాగంలో 38 మంది పర్మినెంట్, 84 మంది కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు ఉన్నారు. అయితే వీరిలో కొంతమంది కలెక్టరేట్ కార్యాలయంలో, మరికొంతమంది ఆర్‌డిఒ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. దీనివల్ల పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణకు సరిపడే పారిశుధ్య కార్మికుల్లేకపోవడం కారణం. 15 వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న శానిటరీ సెక్రెటరీల పర్యవేక్షణ పూర్తి స్థాయిలో లేకపోవడం, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి ఒకే ఒక అధికారి పర్యవేక్షణ ఉండడం ప్రధాన కారణమని చెప్పవచ్చు. 30 వార్డుల్లో ఇంటింటికి చెత్త సేకరణ మాత్రమే

పట్టణంలో పేరుకుపోయిన చెత్త

జరుగుతుంది కానీ ఏ వీధులో చూసినా పారిశుధ్య నిర్వహణ పూర్తి స్థాయిలో జరగడం లేదు. పట్టణంలోని అన్ని వార్డుల నుంచి పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు 25 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాల్సిన పరిస్థితి ఉంది. కానీ సిబ్బంది కొరత కారణంగా తరలింపు చర్యలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. మున్సిపల్ పరిధిలో పక్కా కాలువలు 71 కిలోమీటర్లు ఉన్నాయి. పలు వీధుల్లోని కాలువల్లో చెత్తలు, వ్యర్థాలు పేరుకుపోయి వాడుక నీరు వెళ్లేందుకు అవకాశం లేక మురుగునీరు నిల్వ ఉండడంతో ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రతి ఏటా మున్సిపల్ సాధారణ నిధుల నుంచి పట్టణ పారిశుధ్య నిర్వహణకు సుమారు రూ.47 లక్షల వరకు ఖర్చువుతుంది. పట్టణంలో సుమారు 6 కాలనీలు కొత్తగా ఏర్పడ్డాయి. ఆ కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఆయా కాలనీల కాలువల్లో పూడికలు పేరుకుపోయి మురుగు కదలని పరిస్థితి నెలకొంది. అయితే అధికారులు మాత్రం స్వచ్ఛతలో పట్టణం ముందుగా ఉందని కాగితాల వరకే ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఆచరణలో లేదు.

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సంక్షేమ పథకాలు ప్రజల చెంతకే చేరాలనే లక్ష్యంతో వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే సచివాలయ ఉద్యోగులకు తమ విధులకు సంబంధించిన పనులనే కాక అదనపు బాధ్యతలు అప్పజెప్పడంతో వారు రోజువారీగా చేయాల్సిన విధులను సక్రమంగా నిర్వహించలేకపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. పట్టణంలో పలు వార్డులో పారిశుధ్య నిర్వహణ జరుగుతున్న తీరును ఇటీవల బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ సందర్శించారు. వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం లో ఔట్సోర్సింగ్ విధానంలో ఇటీవల కొత్తగా పారిశుధ్య కార్మికులుగా నియమించిన వారిని వేరే కార్యాలయంలో విధులకు పంపిస్తున్నారు. వీరిని పట్టణంలో ఉన్న పలు వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పనులకు ఉపయోగిస్తే రానున్న రోజుల్లో స్వచ్ఛతలో పార్వతీపురం మున్సిపాలిటీ ముందంజలో ఉండేందుకు అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు

త్వరలో అన్ని వార్డులను ప్రజారోగ్య అధికారి, వార్డు సచివాలయాల శానిటరీ కార్యదర్శులతో కలిసి సందర్శించి పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు చేపడతాం. పట్టణంలో స్వచ్ఛత కనిపించేలా చర్యలు తీసుకుంటాం.

కె.శ్రీనివాసరావు,
కమిషనర్

పృథ్వీరాజ్‌ను అభినందిస్తున్న పట్టణ వాసులు

సివిల్స్ ర్యాంకర్ పృథ్వీరాజ్‌కు పలువురి అభినందన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక పాత బస్టాండ్ సమీపంలో ఉన్న సౌందర్య నారాయణ మూర్తి నగర్ కాలనీ అసోసియేషన్ పృథ్వీరాజ్ కుమార్‌ను దుశ్శాలువతో సత్కరించి పుష్పగు పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు. ఇదే కాలనీలో నివాసముంటున్న దొనక విజయ్‌కుమార్, వెంకటరత్నం కుమారుడు పథ్వీరాజ్ కుమార్ ఇటీవల ఐఎఎస్‌కు ఎంపికైన సందర్భంగా సౌందర్య నారాయణ మూర్తి నగర్ కాలనీ ఫ్యామిలీ అసోసియేషన్ (ఎస్ఎన్ఎం ఎస్ఎఫ్ఎ) ఆధ్వర్యంలో శనివారం రాత్రి కాలనీలో గల షిర్డీసాయి ధ్యాన మందిరం వద్ద ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్స్ ర్యాంకర్ మాట్లాడుతూ తాను ఐఎఎస్ సాధించడానికి తన కుటుంబ సభ్యులు ఇచ్చిన ప్రోత్సాహంతో పాటు అంకుటిత దీక్ష, పట్టుదల, కృషే కారణమని పృథ్వీరాజ్ కుమార్ తెలిపారు. ఒక సాధారణ మధ్య తరగతికి చెందిన వ్యక్తిగా నా బిడ్డ సాధించిన విజయాన్ని ఎంతో ఆనందంగా ఆస్వాదిస్తున్నానని నా బిడ్డను అందరూ ఆశీర్వదించాలని విజయ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు గొర్లి శంకర్రావు, ఉపాధ్యక్షులు మజ్జి రాజా, కార్యదర్శి జగదీష్, సహాయ కార్యదర్శి కుమిలి రవికుమార్, కోశాధికారి కేశవరావు, సభ్యులు శ్రీనివాసరావు, పసుమర్తి బుజ్జి, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు..

బి-ఫారాలు అందుకున్న టిడిపి అభ్యర్థులు

టిడిపి అభ్యర్థులకు బి-ఫారాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో పోటీ చేస్తున్న కురుపాం, సాలూరు, పార్వతీపురం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థులు తోయక జగదీశ్వరి, గుమ్మడి సంధ్యారాణి, బోనెల విజయచంద్ర టిడిపి జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా బి ఫారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బంధువులు అభినందనలు తెలిపారు.

ఒక్కపూటే ఉపాధి పనులు నిర్వహించాలి

ప్రజాశక్తి - కురుపాం

ఎండల తీవ్రతను దృష్ట్యా ఉపాధి హామీ పనులు ఒక్క పూటే నిర్వహించాలని అధికారులను బికెఎంయు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో భాగంగా వ్యవసాయ కార్మికులకు ఉపాధి పనులు ఒక్కపూట పనులు కల్పించి, వడ దెబ్బ బారిన పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పని ప్రదేశంలో టెంట్లు, మజ్జిగ ఏర్పాట్లు చేసి ఉపాధి హామీ చట్టం కింద పని అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇచ్చి, 200 రోజులు పని దినాలు రూ.600 రోజువారి వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి -భామిని

భామిని ఆదర్శ పాఠశాలలో 2024 -25 విద్యా సంవత్సరంలో ఆదర్శ పాఠశాలలో ఆరోతరగతి ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రెవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షలకు 216 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 194 మంది హాజరయ్యారని, 22మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

వీరఘట్టం : జనసేనలో చేరిన బిటివాడ, డిపివలసకు చెందిన ప్రజలు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - కురుపాం

వైసిపి సీనియర్ నాయకులు, కురుపాంకు చెందిన మంతిన త్రిపురనాథ్, వార్డు సభ్యులు జి.నాగరాజు, కురుపాం,గోలవలస, కిచ్చాడ గ్రామాలకు చెందిన వాలంటీర్లు సి.సంతు, శెట్టి శ్రీనివాస్, సందీప్ వాలంటీర్లు, వైసిపి కార్యకర్తలు ఆదివారం కురుపాం కోటలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేశ్ చంద్రదేవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. వీరికి సాదరంగా కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్, యువ నాయకులు చందక రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

150 కుటుంబాలు జనసేనలోకి

వీరఘట్టం : స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి ఇలాకాలో ఆదివారం ఉమ్మడి జనసేన అభ్యర్థి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో బిటివాడకు చెందిన శ్రీరామ్ అప్పలనాయుడు, జగదీష్, కె.గంగునాయుడు, శ్రీరామ్ లక్ష్మునాయుడు, శంకర్రావు, తదితర సుమారు 100 కుటుంబాల కార్యకర్తలను నిమ్మక జయకృష్ణ కండువు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే డిపి వలసకు చెందిన ఉప సర్పంచి ఎం.సూర్యనారాయణ, పి.నారాయణరావు, ముసలి నాయుడు, ఆధ్వర్యాన పలువురు జనసేనలో చేరారు. కార్యక్రమంలో బిసి సెల్ కన్వీనర్ పి.కృష్ణమూర్తి నాయుడు, మండల అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ ఉమామహేశ్వరరావు, లింగాల చంటి, రాష్ట్ర మహిళా కార్యదర్శి కె.లలిత కుమారి, జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి బిపి నాయుడు, సంయుక్త కార్యదర్శి వజ్రగడ రవికుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజన్నదొర సమక్షంలో చేరిన పాచిపెంట మండలం మోసూరుకు చెందిన గ్రామస్తులు

వైసిపిలో చేరిన 35 కుటుంబాలు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలం లోని మోసురుకు చెందిన 35 కుటుంబాలు ఆదివారం టిడిపిని వీడి వైసిపిలో చేరాయి. వీరిని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. సర్పంచ్ ప్రతినిధి గండిపల్లి రాము ఆధ్వర్యంలో గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి హాజరైన రాజన్నదొర సమక్షంలో గ్రామానికి చెందిన 35 టిడిపి కుటుంబాలు వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి రాష్ట్రమంతటా వైసిపిలోకి చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు గొట్టాపు ముత్యాలు నాయుడు, పి.వీరంనాయుడు, వైస్ ఎంపిపి రవీంద్ర, గ్రామానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని వత్తాడలో పెద్దలు, యువత టిడిపి నుంచి వైసిపిలో చేరారు. ఐదేళ్ల పాలనలో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు, స్థానిక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి చేసిన అభివృద్ధి చూసి వైసిపిలో చేరుతున్నట్లు తెలిపారు. వీరికి ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, వత్తాడ మాజీ సర్పంచ్ తాడంగి శ్రీను రాజు, వైస్ సర్పంచ్ పాలక. మహేష్ ఉన్నారు.

పెదపదంలో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో వైసిపి గెలిస్తేనే పేదలు, మధ్యతరగతి ప్రజల కష్టాలు తీరుతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి అన్నారు. మండలంలో పెదపదం పంచాయతీలో గల పాలికవలస, మిర్తివలసలో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారంలో చేశారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. రానున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమైనవన్నారు. మరోసారి ఎమ్మెల్యేగా రాజన్నదొరకు అవకాశం ఇవ్వాలని, ఫ్యాన్ గుర్తు పై ఓటు వేయాలని ఆమె కోరారు. ప్రచారంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వైసిపి ప్రచారం

వీరఘట్టం : మండలంలోని శృంగరాయిపురం, పాపంపేట, డిపివలస, చేబియ్యంవలస తదితర గ్రామాల్లో ఆదివారం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వి.కళావతి ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామానికి వెళ్లి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.

వీరఘట్టం : శృంగరాయిపురంలో ప్రచారం చేస్తున్న కళావతి

అర్ధాంతరంగా నిలిచిన ఆస్పత్రి పనులు

- రోగులకు, వైద్యులకు తప్పని అవస్థలు
- ఆర్థికంగా చితికిపోతున్న గిరిజనులు
- పాలకులకు పట్టని ప్రజా సమస్యలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రి సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. 30 పడకల నుంచి వంద పడకల ఏరియా ఆసుపత్రిగా 2020 లో అప్ గ్రేడ్ చేసి రూ.19.7 కోట్లు మంజూరైనప్పటికీ పనులు సకాలంలో పూర్తి కాక మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో ఆస్పుత్రికి వచ్చే రోగులకు, ఇటు విధులు వైద్యులకు అవస్థలు తప్పడంలేదు. ఈ ఏరియా ఆసుపత్రికి సీతంపేట, భామిని, శ్రీకాకుళం జిల్లా కొత్తూరు, హిరమండలం, ఒడిస్సాలోని ప్రజలకు ఈ ఆ స్పత్రి పెద్దదిక్కు. ఈ ఆసుపత్రికి రోజుకు 250 నుంచి 300 పైగా రోగులు చికిత్స కోసం వస్తుంటారు. సోమ, బుధ, శుక్రవారం శుక్రవారం రోజుల్లో 300 నుంచి 350 వరకు ఒపి పెరుగుతుంది. ఇంతటి ప్రాధ్యాత గల ఆసుపత్రి నిర్మాణంపై అధికారులు, పాలకుల నిర్లక్షం చూపడం ఎంత వరకు సమజంసమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ ఏరియా ఆసుపత్రిలో 23 మంది వైద్య నిపుణులు ఉన్నప్పటికీ వారు రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలందించేందుకు మౌలిక సౌకర్యాలు శూన్యం. వసతి సౌకర్యాల్లేకపోవడంతో ఒక్కొక్క ఇరుకు గదిలో నలుగురు వైద్యులు రోగులను పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాంట్రాక్టరు ఒప్పందంగా ప్రకారం 15నెలల్లో నిర్మించి అప్పగించాలి. అయితే రూ.19.7కోట్లు గానూ జిఎస్‌టి, అన్ని పన్నులూ పోనూ రూ.13.30కోట్లు మంజూరు చేశారు. న్యూ బ్లాక్, ఎజిస్టింగ్ బ్లాక్., సెకండ్ ఫ్లోర్, బయో వేస్ట్, మార్చురీ, సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్సార్మరం నిర్మించాల్సి ఉంది. వీటిలో మొదటి విడతలో రూ.7 కోట్లు విడుదల చేయగా ఎగ్జిస్టింగ్ బ్లాక్, ఒపి బ్లాక్ పూర్తి చేశారు. కరెంటు, వాటర్ సదుపాయం కల్పించారు. ఐపి బ్లాక్ 90 శాతం పనులు పూర్తి చేశారు. కాంట్రాక్టులు చేసిన పనికి ఇంకా రూ.కోటి 80 లక్షలు మాత్రమే చెల్లించాలి చెల్లించాల్సి ఉంది. ఇంకా 6.30కోట్లకు ట్రాన్సార్మరం మార్చి బ్లాక్ బయో వేస్ట్ తదితర పనులు చేయాల్సి ఉంది. ప్రధానమైన సమస్యలు రాంపు ఎత్తు కనెక్టింగ్ శ్లాబ్ పనులు పూర్తిగా కాకపోవడంతో రోగులు, వైద్యులు పైకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి బ్లాక్ పనులు పూర్తి కాకపోవడంతో 35 పడకలు కొత్తవి ఉన్నప్పటికీ ఇంకా ప్రారంభించలేదు. ఉన్న 54 పడకలు. గదుల్లో ఉండగా మిగతావి వారండాలో వేస్తూ రోగులకు వైద్యమందిస్తూ నెట్టుకొస్తున్నారు. అంతేకాకుండా ట్రాన్సాఫార్మర్ ప్రత్యేకంగా లేకపోవడంతో ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్య వెంటాడుతుంది. ప్రస్తుతం ఎండలు భగభగ మండుతున్నాయి. ఉష్ణోగ్రత అధిక డిగ్రీలు పెరగడంతో ప్రజలు రోగాల బారినపడి

వసతి సౌకర్యం లేకపోవడంతో వరండాల్లోనే చికిత్స పొందుతున్న రోగులు

ఆస్పత్రికి రోగుల తాకిడి పెరగనుంది. అంతేకాకుండా వర్షాలు ప్రారంభమై సీజనల్ జ్వరాలు ప్రారంభమైతే రోగుల సంఖ్య మరింత అత్యధికంగా పెరగనుంది. అప్పటికీ భవనాల పనులు పూర్తి చేయకపోతే రోగులకు, వైద్యులకు కష్టాలు తప్పవు. కావున ఏరియా ఆసుపత్రి పనులు వెంటనే పూర్తి చేయాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

బిల్లులు చెల్లించకే పనులు నిలిచిపోయాయి

ఏరియా ఆస్పత్రి పనులు నిలిచిపోవడంపై ఎపిఎంఐఎస్ఐడిసి డిఇ సిమ్మన్న, ఎఇ ఇంద్రసేనను 'ప్రజాశక్తి' వివరణ కోరగా, గుత్తాదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేశారని తెలిపారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

స్థానిక ఏరియా ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల సమస్య కాకుండా సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. ఇక్కడ ఎక్స్‌రే అసిస్టెంట్లు ముగ్గురు ఉండాల్సి ఉండగా, కేవలం ఒక్కరే ఉండడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్న ఒక్క ఎక్స్‌రే అసిస్టెంట్ సెలవు పెడితే అత్యవసర సమయమైనా రోగి పరిస్థితి వాయిదా వేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

పనులు పూర్తి కాకపోవడం వాస్తవమే

స్థానిక ఏరియా ఆసుపత్రి ర్యాంపు ఎత్తు కనెక్టింగ్ శ్లాబ్ కొత్త ఏరియా ఆసుపత్రి బ్లాక్ పనులు ట్రాన్స్‌ఫార్మర్ పనులు పూర్తికాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పనులు పూర్తి కాకపోవడంతో ఇబ్బంది పడుతూ వైద్యం అందించాల్సిన పరిస్థితి నెలకొంది.

బి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి సీతంపేట.

తహశీల్దార్‌కు సూచనలు చేస్తున్న ఆర్ఒ విష్ణుచరణ్

స్ట్రాంగ్‌రూం పరిశీలన

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూంలను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సి.విష్ణు చరణ్ ఆదివారం పరిశీలించారు. ఇవిఎంల భద్రతకు సంబంధించి తహశీల్దార్ ఎ.సింహాచలంకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆర్వో కార్యాలయాన్ని సందర్శించారు.

పార్వతీపురంరూరల్ : మేలో జరగబోయే శాసనసభ ఎన్నికలకు ఉపయోగించాల్సిన ఇవిఎంలను భద్రపర్చిన రూములను ఆదివారం పార్వతీపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.హేమలత పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఇవిఎం స్ట్రాంగ్ రూములను సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీతానగరం తహశీల్దార్ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కారును తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని ఆడారు దగ్గర ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును స్థానిక తహశీల్దార్ కె.ఆనందరావు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా చెక్ పోస్టు సిబ్బంది చేపడుతున్న వాహన తనిఖీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనిఖీలు పక్కగా చేపట్టాలని, నగదు, మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు జగదీశ్వరి నామినేషన్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి తోయక జగదీశ్వరి సోమవారం నామినేషన్ వేయనున్నారు. నామినేషన్ సందర్భంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి టిడిపి, జనసేన, బిజెపి మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. పద్యాలు, గద్యాలు, క్రీడా పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే పలు రకాల పుస్తకాలను సిద్ధం చేశామని వీటిని చదువుకోవాలని కోరారు. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారని గ్రంథాలయ నిర్వాహకులు మధుసూదనరావు తెలిపారు. కార్య క్రమంలో పాఠకులు రౌతు శ్రీనువాసరావు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు

కాంగ్రెస్‌లో బి-ఫారం గందరగోళం

- తనకే వచ్చిందంటున్న అభ్యర్థి పుష్పారావు
- 22న పంపిణీ చేస్తారంటున్న సీనియర్ నాయకులు

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి విషయంలో గందరగోళం కొనసాగుతోంది. ఎమ్మెల్యే అభ్యర్థిగా మువ్వల పుష్పారావును పార్టీ అధిష్టానం ముందు ప్రకటించింది. అయితే తనకు టికెట్ కావాలని కోరుతూ రిటైర్డ్ సహకార శాఖ అధికారి గేదెల రామకృష్ణ కాంగ్రెస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. తనకే సీటు వస్తుందని రామకృష్ణ ఆశాభావంతో వున్నారు. రామకృష్ణకు సీటు ఇస్తే బాగుంటుందని స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు హైకమాండ్‌కు చెప్పారు. కానీ తనకు కాంగ్రెస్ పార్టీ బిఫారం అందిందని అభ్యర్థి పుష్పారావు ఈనెల 19 రాత్రి పది గంటల సమయంలో సోషల్ మీడియా గ్రూపులో వెల్లడించారు. పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల చేతుల మీదుగా బిఫారం అందుకున్న ఫొటోను అభ్యర్థి పుష్పారావు షేర్ చేయడంతో కాంగ్రెస్ నాయకులను ఆశ్చర్యానికి గురి చేసింది. శుక్రవారం రాత్రి తనకు బిఫారం అందిందని చెప్పిన అభ్యర్థి పుష్పారావు గానీ, డిసిసి అధ్యక్షులు నిమ్మక సింహాచలం గాని ఇంతవరకు స్థానిక కాంగ్రెస్ నాయకులు సిగడాపు బంగారయ్య, ద్వారపు రెడ్డి పుండరీకాక్ష నాయుడుకు చెప్పలేదు. కొద్దిరోజుల క్రితం స్థానిక నాయకులను సంప్రదించకుండా హడావుడిగా పట్టణంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని డిసిసి అధ్యక్షులు నిమ్మక సింహాచలం, అభ్యర్థి పుష్పారావు ప్రారంభించారు. దీనిపై స్థానిక కాంగ్రెస్ నాయకులు సిగడాపు బంగారయ్య, ద్వారపు రెడ్డి పుండరీకాక్ష నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మిత్రపక్షాలైన సిపిఎం, సిపిఐ నాయకులను కూడా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి పిలవలేదు. రామకృష్ణ కాంగ్రెస్ పార్టీకి దరఖాస్తు చేసుకున్న తర్వాత ఎమ్మెల్యే అభ్యర్థిని మారుస్తారనే ఉహాగానాలు తెరపైకి వచ్చాయి. ఈ ఊహాగానాలు ప్రచారం లో వుంటుండగా శుక్రవారం రాత్రి తనకే బిఫారం వచ్చిందని అభ్యర్థి పుష్పారావు బహిర్గతం చేయడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు విస్మయానికి గురయ్యారు. ఇంతవరకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల్లో కొంతమందిని మారుస్తారని, వాటిలో సాలూరు నియోజకవర్గం కూడా వుందని పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఈ నెల 22న అభ్యర్థుల మార్పుతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థులందరికీ బిఫారాలు అందజేస్తారని ఈ నాయకులు వాదిస్తున్నారు. అయితే బిఫారం తనకే అందిందని చెప్పిన అభ్యర్థి పుష్పారావు ఇంతవరకు స్థానిక కాంగ్రెస్ నాయకులనుగానీ, లెఫ్ట్ పార్టీల నాయకులను కలవలేదు. పలానా రోజున నామినేషన్ దాఖలు చేస్తామని అభ్యర్థి పుష్పారావు చెప్పకపోవడం గమనార్హం. బి-ఫారం ఎవరికి ఇస్తే వారి గెలుపు కోసమే పని చేస్తామని పట్టణ అధ్యక్షులు సిగడాపు బంగారయ్య చెప్పారు.

వ్యాక్సిన్ వాడకంపై సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఐఒ నారాయణరావు

పిహెచ్‌సిని సందర్శించిన డిఐఒ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నారాయణరావు ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో గల రికార్డులను, నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులకు ఇచ్చే టీకాలను క్రమం తప్పకుండా అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు అభినవ్ కూమార్, అమరసింహారెడ్డి, వైద్య సిబ్బంది శ్రీహరిరావు తదితరులు పాల్గొన్నారు.

డిజె సౌండ్ సిస్టమ్‌ను వినియోగించరాదు : సిఐ

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఊరేగింపుల్లో డిజె సౌండ్ సిస్టంలను వినియోగించరాదని టౌన్ సిఐ విహెచ్.వాసునాయుడు చెప్పారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ ఒకవేళ ఊరేగింపుల్లో డిజె సౌండ్ సిస్టంలను వినియోగించినట్టయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివాహాలు జరుపుకునే సందర్భంగా ఊరేగింపులు కూడా రాత్రి పది గంటల తర్వాత అనుమతించబోమని చెప్పారు. పోలీసు శాఖ నిబంధనలకు లోబడి పట్టణ ప్రజలు సాంప్రదాయ పద్ధతిలో వివాహాలు నిర్వహించుకోవాలని సిఐ కోరారు.

కాంగ్రెస్ ఎమ్‌పి అభ్యర్థిగా బొబ్బిలి శ్రీను

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా బొబ్బిలి శ్రీనును ఆ పార్టీ అధిష్టానం ఆదివారం సాయంత్రం ప్రకటించింది. ఎఐసిసి జనరల్ సెక్రెటరీ కెసి వేణుగోపాల్ అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. ప్రస్తుతం బిజెపిలో జిల్లా కార్యదర్శిగా కొనసాగుతున్న శ్రీను కాంగ్రెస్ పార్టీ నుంచి విజయనగరం పార్లమెంట్ అభ్యర్థిగా సీటును దక్కించుకోవడం గమనార్హం. బిజెపి పార్టీకి రాజీనామా ఇచ్చినట్లు గాని, అటు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు గాని జిల్లా నాయకులకు తెలియదని అంటున్నారు.

బి-ఫారాలు అందుకున్న ఎమ్‌పి, ఎమ్మెల్యే అభ్యర్థులు

టిడిపి అభ్యర్థులకు బి-ఫారాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని విజయనగరం పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు వేసిన టిడిపి అభ్యర్థులు ఆదివారం పార్టీ అధ్యక్షులు చంద్రబాబునాయుడు నుంచి బి-ఫారాలు అందుకున్నారు. వీరిలో పార్లమెంట్ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, చీపురుపల్లి అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు, గజపతినగరం అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్, రాజాం అభ్యర్థి కోండ్ర మురళీ మోహన్ , విజయనగం అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఉన్నారు.

రేపు చెల్లూరు వద్ద సిఎం సభ

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 23న సాయంత్రం చెల్లూరు కూడలి వద్ద నిర్వహించనున్న సిద్ధం సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, ప్రజలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర ఈనెల 23న చెల్లూరు కూడలి వద్దకు చేరుతుందని అన్నారు. అక్కడ సాయంత్రం నిర్వహించనున్న సిద్ధం సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. నామినేషన్ వేయడం పూర్తయినందున ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నట్లు చెప్పారు. 22 గ్రామాలు, 50 డివిజన్లలో బహిరంగ సభలు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. సమావేశంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయ యాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేటర్ కంటుభుక్త తవిటి రాజు, జోనల్ ఇన్చార్జులు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మార్కెట్‌లో ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి మీసాల గత

గీత ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఆదివారం ప్రచారం చేపట్టారు. నగరంలోని గంటస్తంభం వద్ద చేపలమార్కెట్, కూరగాయలు మార్కెట్ ఏరియాలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. తాను ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో చేపట్టిన అభివృద్ధి గురించి వివరించారు.

నాయకుల 'మందు చూపు'

పక్క రాష్ట్రం నుంచి వస్తున్న మద్యం, సారా • ముమ్మరంగా ఎస్ఇబి తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకోవడానికి వివిధ రూపాల్లో ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నుంచి అడ్డంకులు పెరుగుతుండటంతో ముందస్తుగానే తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. తమ అనుయాయులకు చెందిన రహస్య స్థావరాల్లో మద్యం నిల్వ చేసుకుంటున్నారు. రాష్ట్రంలో మద్యం ధరలు ఎక్కువగా ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నారు. అధికారులు ఎన్ని చెకోపోస్టులు ఏర్పాటు చేసినా రహస్య స్థావరాలకు తరలిపోతోంది. జిల్లా, డివిజన్, నియోజకవర్గ కేంద్రాల నుంచి ముఖ్యమైన గ్రామాలకు ఇప్పటికే డబ్బు, మద్యం ఎలా తరలించాలనే అంశంపై ఆయా పార్టీల నాయకులు ప్లాన్ గీశారు. గతంలో జిల్లాలోని టిడిపి, వైసిపి పార్టీలకు చెందిన వారికే ఎక్కువ మద్యం దుకాణాలు, బార్లు ఉండేవి. కొన్నేళ్లుగా ప్రభుత్వం మద్యం దుకాణాలను నిర్వహిస్తుండటం వల్ల ప్రతిపక్ష పార్టీల వారికి సరుకు దొరకని పరిస్థితి ఉంది. మన రాష్ట్రంలో మద్యం ధరలు ఎక్కువగా ఉండటం, పక్కనే ఒడిశాలో తక్కువ ధరకు దొరుకుతుందటంతో పక్క రాష్ట్రాలపై దృష్టి సారించారు. అంతేగాక రాష్ట్రంలో మద్యం నాణ్యత లేదు. ధరలు అధికంగా ఉంటున్నాయి. దీంతో ప్రభుత్వం విక్రయిస్తున్న మద్యం బ్రాండ్లపై మద్యం ప్రియులు అసంతృప్తిగా ఉన్న నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల నుంచి అర్డర్లపై కొనుగోలు చేసి రహస్య స్థావరాలకు తరలిస్తున్నారు. ఎక్కువగా మద్యం నిల్వలు చేసుకునేందుకు అవకాశం ఉంది. మరోవైపు జిల్లాలో ఎస్ఇబి అధికారులు ఎక్కడికక్కడ దాడులు నిర్వహించి అక్రమ మద్యాన్ని అడ్డుకుని స్వాదీనం చేసుకుంటున్నారు. అయినప్పటికీ జిల్లాల్లోని ఎక్కువ మంది అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో తమకు అనుకూలంగా ఉన్న వ్యాపారులు, బంధువుల నివాసాలకు మద్యం, డబ్బు తరలిస్తు న్నారు. నియోజకవర్గాల్లో వివిధ సామాజిక వర్గాల గ్రూపు నాయకుల ద్వారా మద్యం పంపిణీకి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందుగానే మద్యం, డబ్బు పంపిణీతోనే పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రధాన రాజకీయపార్టీలు దృష్టి సారిస్తున్నాయి. నోటిఫికేషన్ వచ్చిన తరువాత సరిహద్దులో తనిఖీలు మరింత ముమ్మరమైనప్పటికీ అప్పటికే మద్యం బాటిళ్లను ఎక్కడికక్కడ నిల్వ చేసుకున్నారు. మరోవైపు ఒడిశా నుంచి సారా యథేచ్ఛగా సరిహద్దు గ్రామాలకు సరఫరా అవుతోంది. అటు పార్వతీపురం మన్యం జిల్లాలోని కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పాచిపెంట మండలాలతో పాటు విజయనగరం జిల్లాలోని మెంటాడ, గజపతినగరం, ఎస్.కోట మండలాల్లోని పలు గ్రామాల్లో సారా అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి.

ఇటీవల పట్టుబడిన మద్యం బాటిళ్లు

భారీగా మద్యం, సారా పట్టివేత

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి ఈనెల 15 వరకు 67 నాటుసారా కేసులను ఎస్ఇబి అధికారులు నమోదు చేశారు. 1475 లీటర్ల సారా పట్టుకున్నారు. 16 మందిని అరెస్టు చేశారు. 34,400 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. 53 లిక్కర్ అక్రమ రవాణా కేసులు నమోదు చేశారు. 399 కేసుల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 1592 లీటర్ల మద్యం నిల్వలు స్వాధీనం చేసుకున్నారు. 170 లీటర్ల బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. 61 వాహనాలు, ఏడు సెల్‌ఫోన్లు, రూ.50వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. 583 కిలోల గంజాయి నిల్వలను పట్టుకున్నారు. 15 మందిని అరెస్టు చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి భోగాపురం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి విద్యుత్తు సరఫరా పనులు కారణంగా సోమవారం కొన్ని గ్రామాలకు కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ గ్రామీణ ఇఇ జి.సురేష్ బాబు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. గూడెపువలస, దల్లిపేట, రెడ్డికంచేరు, బైరెడ్డిపాలెం, ముగడపేట, ఆర్.ఆర్ కాలనీ, చాకివలస, ఎ.రావివలస, సన్‌రే విలేజ్‌తో పాటు విమానాశ్రయ ప్రాంతంలో విద్యుత్ ఉండదని తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో చైత్రికకృష్ణకు బంగారు పతకం

ప్రజాశక్తి-పాలకొండ

ఢిల్లీలో జరిగిన డిఎవి పాఠశాలల జాతీయ స్థాయి పోటీలలో అండర్ -14 కేటగిరి బ్యాడ్మింటన్ పోటీల్లో బొడ్డేపల్లి చైత్రిక కృష్ణ బంగారు పతకాన్ని సాధించింది. ఆమె సాధించిన కృషికి ఫలితంగా యాజమాన్యం నగదు బహుమతిని, ప్రశంసా పత్రాన్ని అందించింది. ఆమెకు శిక్షణ ఇచ్చిన పిఇటి పల్లి లక్ష్మునాయుడును, చైత్రిక కృష్ణను డిఎవి పాఠశాల యాజమాన్యం హర్యానాలో ఉన్న పానిపట్టుకు ఆహ్వానించి గౌరవించింది. అందుకుగాను జి.ఎం.ఆర్ యాజమాన్యం, పాఠశాల ప్రిన్సిపల్ ఎం. వెంకటరామిరెడ్డి , మరియు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని నగరపాలకసంస్థ, గంటస్తంభం సెంటర్ , కోరాడ వీధిలో శ్రీ భరత్ ఫుట్‌వేర్ యజమాని పురుషోత్తం రమణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను జెపి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె సిరి సహస్ర ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సోల్జర్స్ అధ్యక్షులు తోట వాసు, సభ్యులు శివ, హేమంత్, దక్షిణామూర్తి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సాయి కష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కామాక్షి నగర్ మెయిన్ రోడ్డులో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 102 గవర్నర్ జామి నారాయణ స్వామి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ, క్లబ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు మాష్టారు, క్లబ్ గౌరవ సలహాదారులు ఆరికతోట తిరుపతిరావు, నోబుల్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్.ఎస్.నాయుడు, నాలుగెస్సల రాజు, త్యాడ చిరంజీవి రావు, తోషిని వాల్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆదినారాయణ, క్లబ్ ఉపాధ్యక్షుడు వల్లూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

120 మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జరజాపుపేటలో ఆదివారం సాధన యువజన సంఘం ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 120 మందికి శంకర్ ఫౌండేషన్ వైద్యులు కంటి పరీక్షలు చేశారు. 35 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. 20 మందికి కళ్లద్దాలు సిఫార్సు చేశారు. తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో గ్రామ పెద్దలు సముద్రపు రామారావు, ఎంఎం నాయుడు, పోలుబోతు నారాయణమూర్తి, నల్లి శ్రీను, సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు బెల్లాన వెంకటరావు, ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, తుమ్ము అశోక్, అవనాపు అప్పలరాజు, డి.పూర్ణ, శంకర్ ఫౌండేషన్ వైద్యులు ఎస్.అలేఖ్య, క్యాంప్ ఇన్‌ఛార్జి సి.హెచ్ వెంకటరమణ, వై పైడిరాజు పాల్గొన్నారు.

ఎపిఎన్‌జిఒ ఆధ్వర్యాన కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎపి ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు జి. పూర్ణచంద్రరావు ఆధ్వర్యాన ఆదివారం అశోక్ బంగ్లాలో 'ఆంధ్ర ప్రదేశ్ పునర్నిర్మాణం - పెన్షనర్ల సంక్షేమం' అనే కరపత్రాన్ని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జి. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, యువత, నిరుద్యోగులు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో పనిచేసే కార్మికులు, రైతులు, మహిళలు టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎపి సచివాలయం సంఘం మాజీ అధ్యక్షులు పి.గురవయ్య, ఎపి ఎన్జీవో మాజీ కార్యదర్శి జి.వి.చౌదరి, ఎపి ఎన్జీవో సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఆర్. రామమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బాలేరు సమీపంలో బత్తిలి నుండి శ్రీకాకుళం వెళ్లే ఆర్‌టిసి బస్సు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకువెళ్లిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎండ తీవ్రతతో కల్లు తిరగడంతో బస్సును నిలుపుదామన్న క్రమంలో అదుపుతప్పిందని డ్రైవర్ కె.బారికి తెలిపారు. ఈ సంఘటనలో ఒక్క ప్రయాణికుడుకి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పొలాల్లోకి దూసుకుపోయిన బస్సు